

కటాక్షపురం మోడల్ కాలనీలో నల్లాల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి సృజన

## మోడల్ కాలనీలో విద్యుత్, నీటి సరఫరా

- 'నమస్తే' వార్తకు స్పందన

ఆత్మకూరు, మే 14 : మండలంలోని కటాక్షపురం గ్రామంలో మూడు రోజులుగా పంచాయతీ కార్యదర్శి సృజన్ మోడల్ కాలనీలో వీధి దీపాలు, నీటి సరఫరా బంద్ చేయించింది. నమస్తే తెలంగాణలో కటాక్షపురం మోడల్ కాలనీ నీళ్లు, వీధి దీపాల కరెంట్ కట్ అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి సృజన బుధవారం నీళ్లు, వీధి దీపాలకు కరెంట్ సరఫరా చేయడంతో మోడల్ కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం 60 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసిందని, వెంటనే లబ్ధిదారులు ఇంటికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని జత చేస్తే, ఇంటిని గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేస్తానన్నారు. ఇంటి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని గ్రామస్తులను కోరారు.

## కేసముద్రంలో పలు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

కాజీపేట, మే 14 : ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న మూడో లైన్ ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల వల్ల విజయవాడ నుంచి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మీదుగా నడిచే పలు రైళ్లకు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో తాత్కాలిక హాల్టింగ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మణుగూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–బీదర్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–లింగంపల్లి మధ్య నడిచే గౌతమీ ఎక్స్‌ప్రెస్, గూడూర్–సికింద్రాబాద్ మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–సికింద్రాబాద్ మధ్య నడిచే పద్మావతి, విశాఖపట్నం– హైదరాబాద్ మధ్య నడిచే గోదావరి, విశాఖపట్నం– మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ మధ్య నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఆగుతాయని తెలిపారు. అదే విధంగా ఈ నెల 24న తిరుపతి– కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి 26వ తేదీ వరకు భువనేశ్వర్–ముంబై మధ్య నడిచే కోణార్క్, ఈ నెల 27న మచిలీపట్నం– సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు శాలిమార్–హైదరాబాద్ మధ్య నడిచే ఈస్ట్‌కోస్ట్, ఈ నెల 25, 27వ తేదీల్లో నర్సాపూర్ – నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న చెన్నై సెంట్రల్ –అహ్మదాబాద్ మధ్య నడిచే నవజీవన్, ఈ నెల 27న బెంగళూరు– లాల్ కౌన్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27న కోయంబత్తూర్–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుతున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. ప్రయాణికులు గమనించి రైల్వేకు సహకరించాలని కోరారు.

## డీజిల్ కాలనీలో చోరీ

కాజీపేట, మే 14 : గుర్తు తెలియని వ్యక్తులు రైల్వే క్వార్టర్స్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన కాజీపేట పట్టణం డీజిల్ కాలనీ రైల్వే క్వార్టర్స్‌లో బుధవారం వెలుగు చూసింది. డీజిల్ లోకో షెడ్డులో అరవింద్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తాడు. బంధువు చనిపోవడంతో రెండు రోజుల క్రితం క్వార్టర్‌కు తాళం వేసి కుటుంబ సభ్యులందరూ అంత్యక్రియలకు ఊరెళ్లారు. బుధవారం తెల్లవారు జామున ఇంటికి తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోని దాదాపు 15 తులాల వెండి వస్తువులు అపహరించుకు పోయారన్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ జరుపుతున్నారని చెప్పాడు.

## కేయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మే 14 : కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని మొత్తం 118 సెంటర్లలో డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్ తెలిపారు. మొదటి రోజు రెండో, ఆరో సెమిస్టర్ (రెగ్యులర్) ప్రారంభమైనట్లు, టైం టేబుల్ ప్రకారం మిగతా పరీక్షలు జరుగుతాయన్నారు. కాగా, నగరంలోని వివిధ కాలేజీల్లో రిజిస్ట్రార్ రామచంద్రంతో కలిసి ఆయన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారులు వెంకటయ్య, తిరుమలదేవి ఉన్నారు.

# రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ బస్సులు

- బస్సు ఢీకొని ఇటీవల రైతు మృతి
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



రాంగ్ రూట్‌లో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

కమలాపూర్, మే 14 : రాంగ్ రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడుపుతుండడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా డ్రైవర్ల తీరు మారడం లేదు. మండలంలోని ఉప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో గత నెల 24న రాంగ్ రూట్‌లో వెళ్తున్న బస్సు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనడంతో కన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాములపల్లికి చెందిన రైతు వంటకాల రాంరెడ్డి మృతి చెందాడు. పరకాల–హుజూరాబాద్ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు లైన్ల రోడ్డు వేసి డివైడర్ ఏర్పాటు చేసి చెట్లు నాటించింది. ఉప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేందుకు హుజూరాబాద్, పరకాల, హనుమకొండ డిపోల ఆర్టీసీ డ్రైవర్లు లెఫ్ట్ సైడ్‌లో కాకుండా రైట్ సైడ్‌లో వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. లెఫ్ట్‌లో స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో రైట్ సైడ్‌లో బస్సులు వస్తున్నట్లు చెప్పారు. రాంగ్ రూట్‌లో రావొద్దని గ్రామస్తులు ఎన్నిసార్లు బస్సు డ్రైవర్లకు చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని పైఅధికారులు స్పందించి రాంగ్ రూట్‌లో నడుపుతున్న డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఉపాధి హామీ పనులకు దరఖాస్తుల స్వీకరణ

ఐనవోలు, మే 14 : ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ అనుబంధమైన వ్యక్తిగత పనులకు ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తులు స్వీకరిసున్నట్లు ఏపీవో నక్క కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, నిమ్మ, బత్తాయి, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోటా, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, మునగ, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్ వంటి తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్, నీటి సౌకర్యం ఉన్న సన్న, చిన్నకారు రైతులు గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ధ్రువీకరణ పత్రం, భూమికి సంబంధించిన డాక్యుమెంట్ లేదా పట్టా పాసుబుక్, ఉపాధి హామీ కార్డు, గ్రామ పంచాయతీ తీర్మానం, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు జత చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించడం, మొక్కల ఖర్చు చెల్లించడం, పంట నిర్వహణ, ఎరువుల ఖర్చులు, ప్రతినెలా నీటి నిర్వహణ ఖర్చులు చెల్లిస్తామన్నారు. అదే విధంగా పశువుల పాక నిర్మాణం, కోళ్ల షెడ్డు, మేకలు లేదా గొర్రెల షెడ్డు, అజోలా గుంతలు, ఎరువుల గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బయోగ్యాస్ ప్లాంటు మొదలైన వాటి కోసం ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## నిట్‌లో సీసీఎంటీ, సీసీఎంఎన్ పోర్టల్స్ ప్రారంభం

**పీజీ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహణ**

హనుమకొండ చౌరస్తా, మే 14 : భారత విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంటెక్, ఎం ప్లాన్ కోర్సుల్లో కేంద్రీకృత ప్రవేశాలు, ఎమ్మెస్సీ టెక్ కోర్సుల నిర్వహణ కోసం అధికారిక పోర్టల్స్ ప్రారంభించారు. దరఖాస్తుదారులు తమ పేర్లు నమోదు చేసే ముందు CCMT పోర్టల్ : https://ccmt.admissions.nic.in, CCMN పోర్టల్ : https://ccmn.admissions.nic.in పోర్టల్స్‌లో అందుబాటులో ఉన్న సంపూర్ణ సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలని, నమోదు గడువు 14 నుంచి జూన్ 4వ తేదీ వరకు ఉంటుందని నిట్ అధికారులు అన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం CCMT-2025 : ccmt2025helpdesk@nitw.ac.in, CCMN-2025: ccmn2025helpdesk@nitw.ac.inకు ఈ–మెయిల్ పంపొచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సాంకేతిక సంస్థల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఈ కేంద్రీకృత అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్ సైట్లను సందర్శించాలన్నారు.

## హమాలీలకు తాడుకట్టు మామూలు రూ.2వేలు ఇవ్వాలి

**కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా.. డీఆర్‌వోకు వినతిపత్రం అందజేత**



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

హనుమకొండ, మే 14 : జిల్లాలో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు తాడుకట్టు మామూలు ఒక లారీకి రూ. 2 వేలు ఇవ్వాలని, ప్రభుత్వమే నేరుగా ఒక బస్తాకు రూ. 70 కూలీ ఇవ్వాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌వో వైవీ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీలో పనిచేస్తున్న హమాలీలకు లారీ యజమానులు ఇచ్చే తాడుకట్టు మామూలు జిల్లా అధికారులు ఇవ్వనీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీ డబ్బులు రైతుల నుంచి వసూలు చేసుకోవాలని చెప్పడంతో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద గొడవలు అవుతున్నాయని, అందుకే ప్రభుత్వమే నేరుగా బస్తాకు రూ.70 ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన వారికి నెలకు రూ.9వేల పెన్షన్ ఇవ్వాలని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంగాల మొగిలి, ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, నాయకులు కొంగటి సదానందం, బేరపాక కేశవయ్య పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు

హనుమకొండ, మే 14 : ఈ నెల 20వ తేదీన దేశవాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంపూర్ణ మద్దతు ఉంటుందని నాయకులు ప్రకటించారు. బుధవారం హనుమకొండలోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాల మహానాడు గ్రేటర్ వరంగల్ నగర అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య, మంద సంపత్, రాంచందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, కార్మికుల కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సమ్మెకు అఖిల భారత స్థాయిలో దళిత శోషణ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం), అనుబంధ కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దూడపాక రాజేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం అశోక్, నాయకులు వేలు సుమన్, రేణిగుంట్ల చందర్ పాల్గొన్నారు.

## చట్టాలపై మహిళలకు అవగాహన తప్పనిసరి

నయింనగర్, మే 14 : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సఖీ అడ్మిన్ హైమావతి అన్నారు. గుండ్లసింగారంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సహాయం, న్యాయ, విద్య, పోలీస్, తాత్కాలిక వసతి వంటి సేవల గురించి వివరించారు. సమస్య ఉన్న మహిళలు 181 మహిళా హెల్ప్‌లైన్, చైల్డ్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో సఖీ కేసు వర్కర్ అనూష పాల్గొన్నారు.

## అందాల భామల రాక వేళ అక్రమ అరెస్టులు



హనుమకొండ చౌరస్తా : పోలీస్ స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ కార్పొరేటర్ అశోక్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్



హసన్‌పర్తి : రాజేందర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హనుమకొండ చౌరస్తా/హసన్‌పర్తి, మే 14 : వరంగల్ నగరానికి అందాల భామలు వస్తున్న నేపథ్యంలో పోలీసులు అక్రమ అరెస్టులు చేశారు. 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, బీఆర్ఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్‌ను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రపంచ అందాల పోటీలు నిర్వహించడం వల్ల రాష్ర్టానికి ఏం ప్రయోజనం లేదన్నారు. 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతపై లేదని, అకాల వర్షాలకు వారు నష్టపోతుంటే పట్టించుకోకపోవడం హేయమైన చర్యని బీఆర్ఎస్వీ నాయకుడు జట్టి రాజేందర్ దుయ్యబట్టారు. మండలంలోని బైరాన్‌పల్లిలో రాజేందర్‌ను హసన్‌పర్తి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేస్తే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు. 6 గ్యారెంటీలు అమలయ్యేంత వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

## పోలీసుల అత్యుత్సాహం

**హరిత హోటల్‌లోకి వెళ్లకుండా ఆపివేసిన వైనం**

హనుమకొండ, మే 14 : వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు విడిది చేసిన హరిత హోటల్ వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఉద్యోగులు అన్నారు. మహిళా సుందరీమణులు కావడంతో రెవెన్యూ, టూరిజం, ఐ అండ్ పీఆర్ శాఖలో పనిచేసే మహిళా ఉద్యోగులకు హరిత కాకతీయ హోటల్‌లో డ్యూటీలు వేశారు. డ్యూటీ పాస్‌లతో వారు హోటల్‌కు వచ్చారు. అయితే పోలీసులకు పాసులు చూపించినప్పటికీ వెళ్లడానికి వీలు లేదని తిప్పి పంపారు. దీంతో మహిళా ఉద్యోగులు అసంతృప్తితో వెళ్లిపోయారు.

## గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఎల్కతుర్తి, మే 14 : మండలంలోని దామెర గ్రామానికి చెందిన అల్లెపు రాజు తన కిరాణా షాపులో గుట్కాలు అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాజు కొన్ని రోజులుగా షాపులో గుట్కాలు అమ్ముతున్నాడమే సమాచారం మేరకు బుధవారం షాపులో తనిఖీలు చేయగా, రూ. 2,275 విలువైన గుట్కాలను పట్టుకున్నట్లు తెలిపారు. రాజు శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన మాడ శ్రీనివాస్ వద్ద నుంచి గుట్కాలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీంతో మాడ శ్రీనివాస్, అల్లెపు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



అనుమానిత కుష్టు కేసులను పరిశీలిస్తున్న వైద్యులు

భీమదేవరపల్లి, మే 14 : మండలంలోని వంగర, కొత్తపల్లి, భీమదేవరపల్లి గ్రామాల్లో బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. గత నెలలో ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సర్వేలో అనుమానిత కుష్టు కేసులను గుర్తించి ఎర్రటి, తెల్లటి స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని పరీక్షించారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యులు రెహమాన్, రుబీనా, దినేశ్, రాజశేఖర్, సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డుల జారీకి కృషి

దామెర, మే 14 : పులుకుర్తిలోని రైతు వేదికలో రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చేందుకు ఏఈవో రామకృష్ణ వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలను బుధవారం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరు, భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

## అభయాంజనేయస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ

కమలాపూర్, మే 14 : మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పిల్లల నారాయణ అభయాంజనేయ స్వామి ఆలయానికి రూ.1,00,116 విరాళం బుధవారం అందజేశారు. ఈ నెల 19న అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనుండడంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య పాల్గొన్నారు.


## ప్రయాణికులకు నీరు అందించడం అభినందనీయం

కాజీపేట, మే 14 : వేసవిలో రైలు ప్రయాణికులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మంచినీటిని అందించడం అభినందనీయమని కాజీపేట స్టేషన్ మాస్టర్ అగ్గి రవీందర్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి పంపిణీ సేవా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి రైళ్లల్లో జనరల్ బోగీల్లో రాకపోకలు సాగించే సామాన్య ప్రయాణికులకు వేసవిలో మంచినీరు దొరక్క ఇబ్బందులు పడుతారన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నీటి పంపిణీని నెల రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా నిర్వాహకులు సురేశ్‌బాబు, జిల్లా శిక్షణ కమిషనర్ ఏలియా తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఎల్కతుర్తి, మే 14 : ఈ నెల 26, 27వ తేదీల్లో జరుగనున్న సీపీఐ మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం ఎల్కతుర్తిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర సీపీఐది అని అన్నారు. హసన్‌పర్తిలో జరుగనున్న మహా సభలకు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 18న ఎల్కతుర్తి మండల మహాసభ జరుగుతుందని తెలిపారు. మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, జిల్లా సమితి సభ్యుడు కామెర వెంకటరమణ, నాయకులు శనిగరపు రాజ్‌కుమార్, తండా మొండయ్య పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



వార్డులో అపరిశుభ్ర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల, మే 14 : పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ చెల్బూరి వెంకటేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డులో డ్రైనేజీలు, పారిశుధ్యం సరిగాలేని ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వార్డుకు వచ్చే చెత్త సేకరణ వాహనాలకు ప్రజలు చెత్త అందించాలని సూచించారు. ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# 12 లీటర్ల గుడుంబా పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, కేసు నమోదు
- ఆటో, సెల్‌ఫోన్ సీజ్



కాజీపేటలో పట్టుకున్న గుడుంబా, రవాణాకు ఉపయోగించిన ఆటో, సెల్‌ఫోన్, ముగ్గురు నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కాజీపేట, మే 14 : కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు ఆటోను తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొన్నారు. కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఇండియా తండాకు చెందిన మహిళ గుగులోత్ బాలి ప్రతి రోజూ గుడుంబాను గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేటకు తీసుకొచ్చి ఆటోలో నగరానికి రవాణా చేస్తున్నట్లు ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సమాచారం వచ్చింది. బుధవారం బాలి కాజీపేట రైల్వే స్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ దిగి తన కోసం సిద్ధంగా ఉన్న ఆటోను ఎక్కి నగరంలోని బయలు దేరింది. ఎక్సైజ్ సిబ్బంది ఆటోను వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తున్న 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని రవాణా చేస్తున్న గుగులోత్ బాలి, వల్లెపు సాంబరాజు, వల్లెపు మహేశ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆటోతో పాటు సెల్‌ఫోన్ సీజ్ చేశామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కోటిలింగం, అయూబ్, పృథ్వీ, శివానీ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంలో అశోక్ హాఫ్ సెంచరీ

**ఆపదలో ఉన్నవారికి 50వ సారి రక్తదానం**



రక్తదానం చేసిన అశోక్‌కు సర్టిఫికెట్ ఇస్తున్న వైద్యులు

శాయంపేట, మే 14 : ఒక్కసారి రక్తం ఇవ్వండని బతిమిలాడినా ఎవరూ ముందుకు రారు. అలాంటిది ఏకంగా 50 సార్లు రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తెలంగాణ జాగృతి నాయకుడు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్ రక్తదానంలో హాఫ్ సెంచరీ చేశాడు. బుధవారం ఆయన 50వ సారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. తొర్రూరుకు చెందిన ఓ ఆస్పత్రిలో సర్జరీ జరుగుతున్న క్రమంలో రక్తం అవసరం ఉందని ఫోన్ రాగా, అశోక్ స్పందించి రక్తదానం చేశాడు. రక్తదానం చేస్తే ఒక ప్రాణాన్ని కాపాడుకోవచ్చని, యువత కూడా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని అశోక్ కోరారు. అశోక్‌ను పరకాల ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ గౌతమ్ చవాన్, ఆర్ఎంవో బాలకృష్ణ అశోక్‌కు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ అందించి అభినందించారు.

# హనుమాందారిపేట



మాందారిపేటలో హనుమాన్ మాల ధరించిన యువత

శాయంపేట, మే 14 : ఆ ఊళ్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. యువత భక్తిభావంలో మునిగి తేలుతున్నారు. శాయంపేట మండలం మాందారిపేటలో యువకులు ప్రతి సంవత్సరం హనుమాన్ మాల ధరిస్తున్నారు. అయితే ఈ సారి ఏకంగా 102 మంది హనుమాన్ మాలధారణ చేసి ఔరా అనిపించారు. ఇంతకు ముందు 80 మంది మాల వేసి భక్తిభావం చాటుకున్నారు. హనుమాన్‌పై భక్తితో 102 మంది ఈ సారి మాల వేసి రికార్డు సృష్టించారు.

## బుర్ర రాములు ఆశయాలను కొనసాగిద్దాం

హనుమకొండ చౌరస్తా, మే 14 : మానవహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ బుర్ర రాములు ఆశయాలను కొనసాగిద్దామని వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తీగల జీవన్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద బుధవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుర్ర రాములు 14వ యాది సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, కేయూ పరిశోధక విద్యార్థి మాదాసి రమేశ్, జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా నాయకులు ముషారఫ్, గణేశ్, నాని, శంకర్, శేఖర్, హర్షద్ పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేశ్ అధ్యక్షతన కేయూ ఎస్డీఎల్సీఈ ప్రాంగణంలో బుర్ర రాములకు నివాళులర్పించారు. ముఖ్య వ్యక్తులుగా భారత్ బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ రాంబ్రహ్మం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్, భారత బచావో నాయకులు వెంగళ్‌రెడ్డి, ఓంబ్రహ్మం, రాజామహ్మద్, విద్యార్థి నాయకులు శివ, అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

పరకాల, మే 14 : పట్టణంలోని రెండో వార్డులో నిజమైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని బీఎస్పీ పట్టణ అధ్యక్షురాలు మడికొండ రవళి డిమాండ్ చేశారు. వార్డు పరిధిలో ఇండ్లు లేక ఇబ్బంది పడుతున్న పలువురు స్థానికులతో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రజలకు తప్పుడు వాగ్దానాలు ఇచ్చి మభ్యపెట్టిందన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో ఇప్పటికే సంవత్సరన్నర పాటు కాలయాపన చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకం కింద మంజూరైన నిరుపేదలు ఇంటి నిర్మాణాలు ప్రారంభించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీల పేరుతో పెత్తనం చేస్తూ పేదలను మధ్య పెడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయమై దృష్టి సారించి నిజమైన అర్హులకు ఇండ్లను కేటాయించాలని కోరారు.

## ఎరువుల వాడకం తగ్గించాలి

**వరంగల్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వెంకట్‌రెడ్డి**

ఐనవోలు, మే 14 : పంటల సాగులో రసాయనాలు, ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ కళాశాల వరంగల్ అసోసియేట్ డీన్ వెంకట్‌రెడ్డి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం బుధవారం కక్కిరాలపల్లిలో నిర్వహించారు. ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, శాస్త్రవేతలు మానస హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు 6 ప్రధాన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిఫారసు మేరకు యూరియా వాడకం, సాగు ఖర్చు తగ్గించుకోవడం, అవసరం మేరకు రసాయన, ఎరువులు, నీటి వినియోగం, పంటల మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ తదితరులు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో హీనా కౌసర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ అలీ, సొసైటీ డైరెక్టర్ మోహన్, మాజీ సర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.